అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

మల్కాజిగిరి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైష్ణవీ ప్రసాద్

నాగోలు: నిరంతరం ప్రజల్లో ఉండే తనను ఎంపీగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి మల్కాజిగిరి గళాన్ని పార్లమెంట్‌లో వినిపిస్తానని స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. గురువారం ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని వనస్థలిపురం, చంపాపేట, కర్మన్‌ఘాట్, ఉప్పల్, మేడిపల్లి, మల్కాజిగిరి, కాప్రాల్లోని వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, పేదల కష్టాలు తెలిసిన తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే వారి కష్టాలను తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా తాను ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను తప్పకుండా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఎల్లప్పుడు ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో నివాసం ఉంటున్న తనకు ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, ప్రజలకు కావాల్సిన రోడ్డు, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, అవసరమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీవాసులు పెద్దఎత్తున సంఘీభావం తెలిపారు. నాయకులు దుద్దు సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కైలాస్, రజిని, సువర్ణ పాల్గొన్నారు.

బీసీలంతా ఏకమై కాసానిని గెలిపించాలి : సబితారెడ్డి



దిల్‌సుఖ్‌నగర్: బీసీలు అంతా ఏకమై బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. శాసన మండలి మాజీ చైర్మన స్వామిగౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, అయాచితం శ్రీధర్, మురుకుంట్ల అరవింద్, పెండ్యాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను అపహరించిన నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికకు మాయమాటలు చెప్పి అపహరించిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.11 వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎం.కె.పద్మావతి తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ సునీత బర్ల కథనం ప్రకారం...సరూర్‌నగర్ ఠాణా పరిధిలో నివసిస్తున్న బాలిక(13) 2017 జనవరి 1న తన ఇంటి నుంచి బయటకు వెళ్లగా.. నిందితుడు మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ (19) మాయమాటలు చెప్పి అపహరించుకెళ్లాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన సరూర్‌నగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి గురువారం నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.11వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

ఇప్పటి వరకూ రూ. 2.63 కోట్ల నగదు పట్టివేత

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచీ పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు రూ.2,63,72,152ల నగదు, 6,37,075 లీటర్ల మద్యం, 2,295 గ్రాముల మాదకద్రవ్యాలు, 4,150 క్వింటాళ్ల బియ్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పెళ్లి పేరుతో మోసం.. యువకుడి అరెస్టు

నాగోలు: ప్రేమ, పెళ్లి అంటూ యువతిని లోబర్చుకొని మోసం చేసిన ఓ యువకుడిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన యువతి, నల్గొండ జిల్లా, కొంపెల్లి గ్రామానికి చెందిన జంగాల మధు చైతన్యపురిలో ఒకేచోట కోచింగ్ తీసుకుంటున్నారు. ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించిన మధు ఆమెను ఎల్బీనగర్‌లోని తన గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె గర్భం దాల్చగా.. తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి అబార్షన్ చేయించాడు. తర్వాత ముఖం చాటేయడంతో ఈ నెల 3న బాధిత యువతి అతడి గదికి వెళ్లి నిలదీయడంతో దాడి చేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బీజేపీతోనే మల్కాజిగిరి అభివృద్ధి సాధ్యం: ఈటల



నాగోలు: మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కొత్తపేట డివిజన్ శివగంగ కాలనీ శివాలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన శివమ్మ నగర్, అంబేడ్కర్‌నగర్, భరత్‌నగర్, ఫేస్ టు, ఫేస్ వన్, రాజీవ్ గాంధీనగర్‌లో కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ పాల్గొన్నారు.

ధైర్యంగా ఢీకొనే సత్తాలేకే మార్ఫింగ్ వీడియోలు..

మన్సూరాబాద్: ధైర్యంగా ఢీకొనే సత్తా లేని కాంగ్రెస్ నేతలు మార్ఫింగ్ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ దుష్ప్రచారానికి దిగజారారని బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ మండిపడ్డారు. మన్సూరాబాద్ డివిజన్ మల్లికార్జున్ కమ్యూనిటీహాల్‌లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈటలతో మాట.. ముచ్చట' ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసినా, ఎన్ని అడ్డంకులు తలపెట్టిన బీజేపీ గెలుపును ఆపలేరని, ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని అన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల బతుకుల్లో వెలుగులు..

నాగోలు: పేదల బతుకుల్లో వెలుగులు రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. గురువారం నాగోలు అనంతుల రామిరెడ్డి గార్డెన్‌లో నాగోలు డివిజన్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మంజుల రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్, చిరంజీవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్: ఎమ్మెల్యే



నాగోలు: ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉండే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలిపించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలకు మద్దతుగా బుధవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని జైన్ మందిర్ నుంచి మోహన్ నగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత ప్రజా సమస్యలు గాలికి వదిలేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సాగర్ రెడ్డి, రాహుల్ గౌడ్, మహేష్ రెడ్డి, విజయ గౌడ్, ఉదయ్‌గౌడ్, రూప తదితరులు పాల్గొన్నారు.